పంజరం

ఈ అంతులేని కన్నీటి కడలికి దరిలేదా? ఆ ఒడ్డున యీ దుఃఖాన్నంతనీ క్షణంలో మరిపించేసే సుఖం లేదా? ఏనాడో ఆ దరికి చేరుతామనే ఆశ లేని జీవి ఉన్నదా? ఎంత కుమిలి కుమిలి ఏడ్చే మనస్సులో నైనాసరే ఆ ఆశ మసక మసకగా దాగుడుమూత లాడుతునే వుంటుంది కాబోలు! అటువంటి ఆశ లేకపోతే దుఃఖిస్తూ బతకటం ఎవరికైనా సాధ్యమౌతుందీ?

సంజెవెలుగులో, చేనుగట్టున, చెమ్మగిల్లిన కళ్లతో గడచిన జీవితంలోని పుటలను తిరగేస్తున్నాడు విశ్వేశ్వర్రావు. ఆ పన్నెండేళ్లూ అతని కన్నీటికి అడ్డులేదు. ఇంత దుఃఖంతో మ్రగ్గిపోతున్న అతని మనసులో కూడా ఆశ ఏదయినా మిణుకు మిణుకు మంటున్నదేమో! గడచిన ఘటనలని తలచుకొంటూ కుమిలిపోవటమే అతనికి తెలుసు. తనుకూడా ఒకనాడు కలలో గూడా అనుకోని సుఖాన్ని అనుభవిస్తాననీ, దరికానరాకుండా వున్న తన శోకానికికూడా, దూరాన ఒక తీరమున్నదనీ ఎన్నడూ అనుకోలేదు. ఇప్పుడుకూడా ఆ ఆశ లేదు. ఎన్నడూ తను చేసిన పని తలచుకొని పరితపిస్తూ ఉంటాడు.

అది జరిగి పన్నెండు ఏళ్లయింది. తలుచుకుంటే ఇప్పుడు జనుగుతున్నట్లే కళ్లకి కట్టుతుంది. అతను బస్తీనుంచి చీకటి పడినాక ఇంటికి వచ్చాడు. అతని కేదో శివమెక్కినట్లుంది.

పూనకం పూనినట్లుంది. ఇంట్లో అడుగు పెడుతూనే 'రజనీ' అని ఉరిమినట్లుగా అరిచాడు. ఉయ్యాలలో పడుకోబెట్టి ఉషను జోలపాడుతూ రజని నిద్రపోగొడుతోంది. భర్త అరుపు విన గానే బెదిరిపోతూ చప్పున లేచి నిలబడింది. విశ్వేశ్వరావుకళ్లు నిప్పులు కక్కుతున్నయ్. ఆనాడు అతనొక దావా ఓడిపోయాడు. అందువల్ల పదివేలునష్టం. ఆ తీర్పు విన్నప్పటినుంచీ పిచ్చెక్కి నట్లయిపోయింది. దోవంతా చికాకుతో చిందులు తొక్కుతూ వచ్చాడు. ఆ చిరాకంతా రజనిమీద విరుచుకుపడుతోంది. "వచ్చారా, ఇంత ప్రొద్దుపోయిందేం?" అని రజని పలక రించింది. ఆ మాట లతని చెవిని దూరలేదు. కోపంతో వణికి పోతున్న గొంతుతో "మీనాన్న బ్రతికివున్నాడా, లేదా?" అన్నాడు. రజని వెలవెలబోయింది. ఏమీ మాట పెగలలేదు. "మాట్లాడవేం? నా యింట్లోంచి బైటికి నడుస్తావా లేదా? మీనాన్న యివ్వవలసిన డబ్బు పట్టుకురా. పో. తెచ్చేదాకా నా గడప తొక్కవద్దు. ఊఁ, కదలవేం? పద బైటికి." రజనికి ఏమీ తోచలేదు. నోట్లోంచి మాటరాదు. మెడబట్టి గెంటే ట్లున్నాడు భర్త. భయంతో గజగజ వణికిపోతూ "ఉష..." అన్నది. "ఏమిటీ? ఉషా? ఇద్దరూ కలిసి ఊరేగండి. నడవ్వేం బైటికి? నీకే చెప్పేది." అని కొట్టవచ్చేటట్టు మీదికి వెళ్లాడు. రజని వణకిపోతున్న చేతులతో పదినెలల పిల్లగా ఉన్న ఉషని ఎత్తుకుని బెదురుతూ బెదురుతూ, వెనుదిరిగి చూస్తూ దీనంగా ఆ చీకటి రాత్రిలో లీనమయిపోయింది. ఠక్కున తలుపు వేసివచ్చి, విశ్వేశ్వరావు పడకకుర్చీలో పడుకుని, మామగారి

మీద మనసులో మండిపడుతున్నాడు. రజనీకి అత్తవారు నగల కోసం యిచ్చిన ఎనిమిదివేలూ తండ్రి వాడుకున్నాడు. ఆయన స్థితి చితికిపోయింది. అప్పటినుంచీ రజనిని డబ్బు తెమ్మని పీడిస్తున్నాడు. భర్తపెట్టే బాధలు పడలేక రజని పుట్టింటికి వెళ్లి తండ్రినడిగి డబ్బు పట్టుకువద్దామని బయలుదేరేది. అక్కడికి వెళ్లి తన తండ్రి పడుతున్న కష్టాలన్నీ కళ్లతో చూసి, అడగటానికి నోరురాక తిరిగివచ్చేది. రజని పడుతున్న బాధ తండ్రికి తెలియకపోలేదు. కాని అంతడబ్బు తేల్చగల శక్తి లేక దిన దినమూ క్షోభపడేవాడు. తల తాకట్టుపెట్టి అయినాసరే రజని బాధలు గట్టెక్కించాలని నిశ్చయించుకున్నాడు. ఈసారి రజని తండ్రి గొంతుమీద కూర్చొని డబ్బు పట్టుకువస్తుందని విశ్వేశ్వరావు లోలోపల ఆశపడుతున్నాడు. నెల గడిచింది. రెండు నెలలు తిరిగినయ్. కానీ రజని జాడలేదు. నాడు కోపంలో ఉషని ఇంట్లోంచి వెళ్లగొట్టినప్పటికీ, కోపం చల్లారటంతో ఓ మనసంతా ఉషమీదనే వుంటోంది. తాతగారింట్లో తప్పటడుగులు వేస్తోంది. ముద్దు మాటలు మాట్లాడుతోంది. 'అమ్మా' 'నాన్నా' అంటోంది. ఉంగరాలు తిరిగిన జుట్టుతో కిలకిల నవ్వుతోంది. ఎన్నోవిధాల ఊహించుకొనేవాడు. పోనీ రజనిని రమ్మని రాద్దామా అని అనుకుంటూండగానే మామగారిమీద కోపం పడగఎత్తి ఒద్దని బుసకొట్టేది. తన యింటికి తాను రావాలని రజనికి తెలియదా? ఎన్నాళ్లు కూచుంటుంది పుట్టింట్లో? తండ్రిని తొందరచేసి, డబ్బు పుచ్చుకొని ఈపాటికే

వచ్చి వేయరాదూ? ఇన్నాళ్లూ రజని ఎందుకు ఉత్తరం వ్రాయక పోవాలి ?

మూడు నెల లయినాక ఒకనాడు విశ్వేశ్వరావు నిద్ర లేవకముందే తలుపు ఎవరో కొట్టారు. తీసేసరికి మామగారు ఎదురుగా కనిపించారు. విశ్వేశ్వరావు మాట్లాడలేదు. లోపలికి రమ్మనలేదు. ఆయనే లోపలికివచ్చి, సంచీ వొంకెకి తగిలించి. జేబులోంచి నోట్లకట్ట బైటికి తీస్తూ "అమ్మాయీ, రజనీ!" అని పిలిచాడు. శూన్యంగా ఉన్న యిల్లంతా ఆ పిలుపుతో గింగురుమన్నది. ఆ పిలుపు వినగానే విశ్వేశ్వరావుకి వెఱ్ఱెత్తినట్లయింది. ఇదేమిటి, రజని పుట్టింట్లో ఉంటే తండ్రి ఇక్కడికివచ్చి కూతురుని పిలుస్తాడేమిటి! మామగారు అడిగారు — "అమ్మాయి ఎక్కడికి వెళ్లింది?" విశ్వేశ్వరావు ముఖంలో నెత్తురుచుక్క లేదు. తత్తరపాటుతో గుండె వణికిపోతోంది. "అక్కడికి రాలేదూ?" మామగారు "లేదు. రాలేదు. ఎప్పుడు బయలుదేరింది!" విశ్వేశ్వరావు ఎల్లాగో పెగుల్చుకుని "మూడు నెలలయింది." అనగానే మామగారు కుప్పన కూలిపోయాడు. ఆయన చేతిలోంచి నోట్లకట్ట జారి విశ్వేశ్వరావు కాళ్లముందు పడింది. అతని కళ్లని తొలుచుకొంటూ ఒక్కసారిగా నీళ్లుబికినై.

అప్పటినుంచీ విశ్వేశ్వరావు రజనికోసమూ, ఉషకోసమూ మూలమూలలా గాలించి నిరాశచెంది జీవితమంతా దుఃఖంతోనే గడుపుతున్నాడు. రజని ఏమయిపోయింది? ఉష ఏమయిపోయింది? ఇక వాళ్లిద్దరినీ ఈ జన్మలో చూడగలడా?

ఎన్నటికైనా తన దుఃఖానికి ఉపశాంతి ఉన్నదా? కన్నీళ్లకి తన పాపాన్ని కడిగివేసే శక్తి వున్నదా?

చేనుగట్టున చతికిలపడి పరిపరివిధాల పరితపిస్తున్నాడు. పక్కనే వాగు చకచకా పరుగులు తీస్తోంది. అస్తమయ సమయంలోని వింత వెలుగులు ఆ వాగు అలలమీద గంతులు వేస్తున్నయ్. ఆకాశమంతా ప్రశాంతంగా ఉన్నది. పడమటి దిక్కున, చెదరిన మబ్బులు, నెత్తురితో తడిసి ఓడిపోయిన సైనికునిలాగా కదలకుండా పడివున్నయ్. ఏదో భీకరమైన యుద్ధం జరిగిన తరువాత ఆవరించే ప్రశాంతి ఆ పడమటి కొండలో కనపడుతోంది. గడచిపోయిన కాలంనుంచి దూసుకు వచ్చిన ఊహలలాగా చలిగాలి గజగజలాడిస్తోంది. మీదున్న ఉత్తరీయాన్ని ఒళ్లంతా కప్పుకుంటూ విశ్వేశ్వరరావు గట్టు మీద కూర్చున్నాడు. ఎదురుగా చేనుగట్టున రావిచెట్టుక్రిందున్న లంబాడీ గుడిసెకేసి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

గొఱ్ఱెలమందలు చేలో అటూ ఇటూ కదులుతూ, ఉండిఉండి వెఱ్ఱి అరుపులు అరుస్తున్నయ్. మడి మధ్య నిలబడి నాయకుడి కొడుకు వాటిని అదిలిస్తున్నాడు.

రావిచెట్టుకింద పొయ్యి రగులుతోంది. కుండ కుతకుత ఉడుకుతోంది. చలికి తాళలేక లంబాడీల కుక్క పొయ్యిరాళ్ళ కానుకొని, కాళ్లు జాపి తోకాడిస్తూ పడుకుంది. వాళ్ల భాషలో మాట్లాడుకుంటూ, పిల్లలు గుడిశెబైట ఆట ఆడుతున్నారు. నాయకుడి భార్య పొయ్యి ఊదుతోంది. నాయకుడు పొయ్యి దగ్గిరే కూర్చుని చలికాచుకొంటున్నాడు.

దగ్గరే పెద్ద చలిమంట భగభగ మంటోంది. ఆ మంట చుట్టూ, చుట్టుపక్క చేలల్లో కాపలా ఉన్న లంబాడీ పడుచులంతా వచ్చి, ఏదో పాటపాడుతూ గుండ్రంగా తిరగటం మొదలు పెట్టారు. పడుచులంతా చరణం అందుకొని పాడుతున్నారు. పాడుతూ అడుగు వేస్తున్నారు. ఆ అడుగుల్లో వాళ్ల కాలి అందెల ఝణఝణ, వాళ్ల దంతపు గాజుల ఘలఘల, వాళ్ల మెళ్లో వేసుకున్న పావలా దండల కలకల, వాళ్ల ముంగురులకు వ్రేలాడే గవ్వల ఝలఝలా ఒక్కసారిగా కలిసి వినపడుతున్నయ్. చిందులువేసే వాళ్ల రూపాలు చిరుగాలిలో అందంగా కదిలే పూలతీగెలలా వున్నయ్. చురుకుగా వాళ్ల చేతులు అటూ ఇటూ సందడితో కదిలి, వాళ్ల ముఖాలమీంది నుంచి దూసుకుంటూ పైకిపోతయ్. అక్కడ వాళ్ల చేతివేళ్లు వింత రీతులతో వికసించే పూవుల రెక్కల్లాగా విప్పారుతయ్! పాడుతూ ఆడుతూ గిరగిర తిరిగేటప్పుడు ఆ మంట వెలుగులో ఒక్కొక్క ముఖం ఒక్కొక్కసారి మెరుస్తూంది. రెప్పవాల్చకుండా చూస్తున్న విశ్వేశ్వరావు చకితుడై పోయాడు. చలిమంట వెలుతురులో ఆగానుకున్న అద్దాలొక్కసారి తళుక్కుమన్నయ్. గవ్వల బరువుతో వ్రేలాడే ముంగురుల మధ్య ఆ లేతముఖ మొక్కసారి ధగధగ మన్నది. ఆ వెలుతురులో ఆ విప్పారిన కళ్లలో ఒక్కసారి వెయ్యి మెరుపులు మెరిసిన కాంతి, ఆ లేత పెదవులమీంద ఏదో చెప్పనలవి కాని చిరునవ్వు.

ఎవరది? ఎవరది? తన పశ్చాత్తాపమే ఆ భగభగమనే చలిమంటయేమో! ఆ మంటలోనుంచి తొంగిచూచిన

ఆ ముఖ మెవరిదో? రజనిదా? ఉషదా? కాదు, కాదు. భ్రాంతి. ఆ పన్నెండేళ్లు ఇంకా రజని బ్రతికి వుండటమేనా? ఇంకా ఉషని చూచే భాగ్యం తనవంటి నీచుని కున్నదా? అంతా వెఱ్ఱి. తనకు మిగిలిన దొక్క— దుఃఖమే.

అయినా ఆ ముఖాన్ని చూడగానే తనలో అటువంటి సంచలన మెందుకు కలగాలి! తన పశ్చాత్తాపాన్ని చూచి విధికి జాలిగలిగి తన భార్యనీ, బిడ్డనీ తనకి తిరిగి ఇస్తుందా? ఎన్నటికీ జరగదు. జరిగిన దాన్ని వెనక్కి— మరల్చటానికి ఎవరికీ తరంకాదు.

అయితే ఆ పాలుగారే ముఖమూ, ఆ సోగకళ్లూ, ఆ నల్లటి ముంగురులూ, ఆ లేత పెదవులమీది చిరునవ్వూ తన మనస్సునకు పరిచితంగా ఎందుకు తోచాలి? అటువంటి ముఖం తా నిదివర కెప్పుడైనా చూశాడా? ఆ ముఖం తన కెప్పుడైనా కలలో కనబడిందా? ఆ ముఖంతో తనకి పూర్వ జన్మలో బాంధవ్య మేమైనా వుందా?

ఏమో! ఎంత చూసినా తనివి తీరదు. ఆ ముఖాన్ని తన మనసులో చెరిగిపోని రంగులలో చిత్రించుకుని దాన్ని నిత్యమూ కన్నీటితో పూజించాలి. ఆ ముఖాన్ని తన ప్రాణంలో లీనంచేసి, తన దుఃఖంలో ఆ స్మృతికి ఆలయం కట్టాలి.

ఇంతలో గొల్లున ఏడుపు. ఆట పాటలు చాలించి అంతా గుడిసె దగ్గిర గుమిగూడారు. చంక నో పెద్దమూటతో ఒక ముసలమ్మ వచ్చింది. వచ్చి రావటంతోనే ఆ ముసలమ్మ

నొక పిల్ల చేతులతో చుట్టి వేసింది. వణుకుతున్న చేతుల్తో ఆ పిల్లని ముసలమ్మ గట్టిగా కౌగిలించుకున్నది. ఇద్దరూ గొల్లు మన్నారు. చుట్టూ ఉన్న వాళ్ళంతా ఒక్కసారి గొల్లు మన్నారు.

ఈధ్వని విని విశ్వేశ్వరరావు తన ఊహల్లోంచి ఒక్క సారి మేల్కొన్నాడు. "నాయకా! ఏమిటాగోల?" అని అరిచాడు. నాయకుడు పరుగెత్తుకుంటూ వచ్చి "ఏంలేదు బాబుగారూ, మాఅక్క ముసిల్ది. శానరోజులికి మాకు కనిపిం చిందండి." విశ్వేశ్వర్రావు విస్తుపోతూ "ఏమిటీ, తిరిగి కలుసు కొంటే ఏడవట మెందుకురా? సంతోషపడాలిగాని—" నాయకుడు "అది మా కులాశారం బాబుగారూ! ఒక్క ముఠాలో వాళ్ళం విడిపోతే మళ్ళీ ఈ జనమకి తిరిగి కలుసుకో లేం బాబుగారూ. దేముడి దయవల్ల తిరిగి కలిశామో ఆ సం బరం పట్టలేక మేము గొల్లున ఏడుస్తాం బాబుగారూ!" అన్నాడు. సంతోషానికీ, సంతాపానికీ ఎంత దగ్గరసంబంధమో విశ్వేశ్వర్రావుకి అప్పుడు తెలిసింది. అక్కడినుంచి లేచి ఇంటి దోవ పట్టాడు. కాని ఆ ముఖం అతన్ని విడవదు. ఆ ముఖమే అతని ప్రాణం మూలమూలలా అల్లుకుపోతూంది. ఆ ముఖమే అతని అణువణువులోనూ నిండిపోతూంది. ఏమిటి వింత?

2

ప్రతి సాయంకాలమూ విశ్వేశ్వర్రావు పొలానికి వెళ్లేవాడు. ఆముఖం కంటబడంగానే అతని దుఃఖంచల్లారినట్లయ్యేది. ఏదో చెప్పలేని సుఖం వచ్చి అతని మనసులో చిందువేసేది.

రాత్రి ఎంతసేపటికి నిద్రపట్టలేదు. ఎదురుగా ఉషకి ఆరోనెలన, తల్లీ కూతురూ కలిసి దిగిన ఫోటో గోడకి వ్రేలాడుతోంది. ఏమో, కాకూడదూ? ఎన్ని వింతలు ప్రపంచంలో సంభవం కావటంలేదు? "ఛీ! ఎందుకీ భ్రాంతి? ఎండమావి నెందుకు వెన్నంటుతావు? చేసిన పాపానికి జన్మాంతమూ దుఃఖంతో క్రుగ్గిపోవటమే నీకు శిక్ష. నీవంటి పాపిమీద విధి దయ తలచదు" అని అతని మనస్సే విశ్వేశ్వర్రావుని నిందించేది. తన వెఱ్ఱిఆశకి తానే సిగ్గిలి బరువెక్కిన గుండెతో కన్ను మూశాడు.

తెల్లవారింది. ఎన్నాళ్లీ ముసుగులో గుద్దులాట? ఒక్కసారి అడిగితే తేలిపోదా? కాని అడగటానికి ఎల్లా నోరువస్తుంది? తనకి పిచ్చి ఎక్కిందనుకోరా వాళ్ళు?

బారెడు పొద్దెక్కింది. వాకిట్లోంచి "బాబూ" అని పిలుపువినిపించింది. అతని మనస్సులో ఆ పిలుపు వింతగా మోగింది. ఏ పూర్వజన్మలోనో విన్నట్లుంది ఆ స్వరం. ఇంకొక లోకంనుంచి రజని పిలిచినట్లున్నది ఆ ధ్వని. వచ్చి చూశాడు. తనివితీరేదాక రెప్ప వాల్చకుండా చూశాడు. ఆ కనుబొమలు ఒకదానితో ఒకటి కలుసుకోబోతున్నట్లు, ఒక నల్లటి నెలవంక

వాటిని రెంటినీ కలుపుతున్నట్లు, నొక్కుల నొక్కుల జుట్టూ, చక్కని ముక్కూ, విశాలమైన నుదురూ, అద్దంలాగా ఉన్న ముఖమూ, గంతులేసే ముంగురులూ - ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనిపిస్తోంది. విశ్వేశ్వర్రావుకి నోట మాట రావడంలేదు. ఆ చూపునుంచి తప్పుకోవాలని ఆ లంబాడీపిల్ల ముసుగు తలమీదికి లాక్కున్నది. ఆ చూపు వెనక దాగిన హృదయంలో ఏ భావాలు వెల్లువలై పొంగుతున్నవో ఆ పిల్ల కేం తెలుసు? తను ఆ హృదయంలో ఎంత కలవరాన్ని మేలు కొలిపిందో ఆ చిన్నగుండె కేం తెలుసు?

"బాబుగారూ! మా మామ గింజలు కొలుచుకు రమ్మని పంపాడు." అన్నది ఆ పిల్ల విశ్వేశ్వర్రావు వాకిట్లో విరియబూసిన ఎఱ్ఱమందారపూలకేసి చూస్తూ. విశ్వేశ్వర్రావు ఎంతో ప్రయత్నంమీద "నీ పేరేమిటి పిల్లా?" అని అడిగాడు. ఇందాకటి సిగ్గు విడిచేసి చెప్పింది - "సోనీ." విశ్వేశ్వర్రావు సోనీని చూస్తో మందారపూలు ఒక్కొక్కటే కోస్తున్నాడు. పువ్వులంటే వుండే మోజు పన్నెండేళ్ల పిల్లలకే తెలుసు. ఆ పూలన్నీ కోసితెచ్చి సోనీ కిచ్చేసరికి ఆమె ముఖం ఒక్క సారిగా విప్పారింది. ఆ సంతోషాన్ని చూసేసరికి విశ్వేశ్వ ర్రావు గుండెమీది బరువు ఒక్కసారిగా మాయమైపోయింది. ఆ పూలన్నీ పట్టినన్ని జడలో పెట్టుకుని, కొన్ని కొంగున మూటకట్టుకుంటూ సోనీ మురిసిపోతోంది. ఆ అమాయకమైన ఆనందాన్ని చూసి విశ్వేశ్వర్రావు గుండె కరిగిపోతూంది. ఆ పిల్ల గింజలమాట మరిచిపోలేదు. మళ్లీ అడిగింది. అతను

బదులు చెప్పాడు: "నువ్వు మోయలేవమ్మా. మీ మామని పంపు."

గోనెలు పుచ్చుకొని లంబాడీ నాయకుడూ, రాత్రి వచ్చిన ముసిలిదీ వచ్చారు. అప్పటికి ఏమయినాసరే వాళ్ళని అడిగి తెలుసుకోవాలని విశ్వేశ్వర్రావు నిశ్చయించుకున్నాడు. కాని ఏ విధంగా ఆ ప్రస్తావన తీసుకురావాలో, ఏ విధంగా వాళ్లని ప్రశ్న వేయాలో పాలు పోవటం లేదు.

"సోనీ రాలేదేం మీతో?"

గుడిశెకాడ మందల్ని మళ్లేస్తోంది బాబూ. అదీ, మాకుఱ్ఱోడూ చేలో మందల్ని కాస్తారు." అన్నాడు నాయకుడు. "ఆళ్లిద్దరూ సిలకా గోరింకల్లాగా కులాసగుంటారు. ఆకలిగూడా ఎరగకుండా మందల్ని కాస్తారు." అని ముసిల్ది అడగని సోది ఏకరువు పెట్టింది.

"సోనీకి ఎన్నోయేడు!"

"పదకొండుంటయ్ బాబూ" అన్నాడు నాయకుడు. "కాదు బాబూ, పన్నెండుంటయ్. ఊహుఁ. పదమూడు బాబూ. అప్పటికే నెలల పిల్ల అది" అన్నది ముసలమ్మ. ఇది వినేసరికి విశ్వేశ్వర్రావు మనస్సు ఒక్క గంతేసింది. గభాలున ఇంట్లోకి వెళ్లి గోడకివున్న రజనీఫోటో తీసుకువచ్చాడు. కళ్లకి దగ్గరగా పెట్టుకొని, గవ్వల బరువుకి ముఖాన కళ్ల కడ్డుపడు తున్న జుట్టు ఎగదోసుకుంటూ ముసలిది పరీక్షగా చూసి "నాయకో! సోనీలాగుందే! ఈ బొమ్మచూసి దాన్ని చూడ

క్కర్లే" అన్నది. నాయకుడుకూడా పరకాయించి చూచి, "బాబూ సోనీ బొమ్మ ఎప్పు డెత్తించారు?" అని అడిగాడు.

ఏమి చెప్పాలో తెలియలేదు. తను పన్నెండేళ్ళక్రిందట ఆనాటి రాత్రి చేసిన దురాగతమంతా వాళ్ళకి చెప్పటానికి నోరాడలేదు. చివరకి అడిగాడు—

"మీ సోనీ ఏ ఊళ్లో పుట్టింది?"

నాయకుడు మాట్లాడటానికి జంకుతున్నాడు. ముసలమ్మ అందుకుని, "మాకు గింజలు కొలిచి పంపెయ్యండి బాబూ గారూ" అన్నది.

"అల్లాగే కొలుస్తాను. కాని సోనీని గురించి కొన్ని సంగతులు అడుగుతాను. చెబుతావా?"

"జరిగి పోయినవాటి ఊసు దేనికి బాబూగారూ?"

"అల్లాగనకు. చెప్పితీరాలి. నిజం చెప్పు. నీకు పెద్ద బహుమతిస్తా"నని ఆశ పెట్టాడు.

తన గౌను జేబులోనుంచి ఒక చిన్న చొక్కాజైబికి తీసింది. అది నల్లటి సిల్కుగౌను. మెడదగ్గర బంగారపు రంగు దారంతో రెండు అక్షరాలు కుట్టి ఉన్నయ్. అవును ఆ పేరే! ఉష. ఉషే! అది రజని తన చేత్తో కుట్టినదే. గతమంతా విరుచుకొని ఒక్కసారి విశ్వేశ్వరరావుమీద పడినట్లయింది. ఆ బరువుకింద అణగారి పోతున్నాడు. ఆ రాత్రి ఉష ఒంటి నున్నది ఆ నల్లసిల్కు గౌనే.

అతని ఒళ్లు జలదరించి పోతూంది. పూస గుచ్చినట్లు, ఎంతో నేర్పుతో ఆ లంబాడీ ముసలిది గడచిన విషయాలన్నీ చెప్పుకు పోతూంది.

తాను రజనిని ఇంట్లోంచి తరిమివేసిన రాత్రి, ఇంత వరకూ వస్తుందని విశ్వేశ్వరరావు కలలో కూడా అనుకోలేదు. దావా ఓడిన చికాకూ, మామగారు ఈయవలసిన బాకీ రాలే దన్న కోపమూ నాటిరాత్రి రజని మీదుగా వెళ్ళిపోయింది. తన కోపానికి ఇంత దారుణమైన పర్యవసాన ముంటుందని అతను లేశమైనా ఊహించలేక పోయాడు. మనిషికి తను చేసే పనులకి ఏ విధమైన ఫలితం రాబోతోందో తెలుసుకొనే శక్తి తగినంతగా సృష్టికర్త యివ్వలేదు. ఆ దూరపు చూపు గనక మనిషి చేతుల్లో వుంటే అతను ఎన్ని పనులనో ముందు గానే చేయకుండా ఉండగలిగేవాడు !

ఆ నాడు మూటా ముల్లే అన్నీ సర్దివేసుకొని కోడి కూయకముందే ఆ ఊరినుంచి జెండా ఎత్తివేద్దామనుకున్నారు లంబాడీలు. రాత్రి బాగా పొద్దుపోయింది. అందరూ నిద్ర పోతున్నారు. ఎక్కడినుంచో గుక్కపట్టి ఏడుస్తున్నట్లు ఏడుపు వినపడ సాగింది. ముసలమ్మ కలత నిద్రలో అటూ యిటూ కొట్టుకుంటూ ఆ ఏడుపు విని అమాంతం లేచింది. తమ ముఠాలో పిల్లలంతా గుఱ్ఱుకొట్టి నిద్ర పోతున్నారు. మరి ఎక్కడి దీ ఏడుపు ? ఇంకా బిగ్గరగా వినబడుతోంది. ఏడుపు వినబడుతున్న వేపుకు ముసలమ్మ గబగబా అడుగు వేసింది. నడిచి వాగుబడ్డుకువచ్చింది. వరదవచ్చి వాగుగట్లని పడదోసుకుంటూ

పరవడితొక్కుతూంది. గట్టున మంచుకితడిసిపోయి మోకాటి దాకా పెరిగిన పచ్చగడ్డి కాళ్లకితాకి కొంకర్లు పోతున్నది ఒళ్ళు. తెల్లటిమబ్బుల్లోంచి గుడ్డివెన్నెల జారుతూతడిసి మంచుముత్యాలతో మెరుస్తున్న రెల్లుపూలతో ఆటలాడుతోంది. కాలికేదో తక్కున తాకింది. నేలమీంద ఉన్న మైలురాయి! ఆ మైలు రాతిమీంద పడుకొని పసిపిల్ల పోరుపెట్టి ఏడుస్తోంది. పచ్చటి ముఖమూ, నల్లటి జుట్టూ, అంతకన్నా నల్లటి గౌనూ ఆ వెన్నెట్లో ముసలమ్మ మనసుని అమాంతంగా గుంజివేసు కున్నయ్. వెంటనే వొణుకుతున్న చేతుల్తో ఆ పిల్ల నెత్తి గుండెల కదుముకున్నది. దిక్కు తెలియని ఆ పిల్లని తేవద్దని ఎందరు వారించినా వినలేదు. పిల్లలులేని తన కోసమే ఈ పిల్లను దేవుడే ఆ రాత్రివేళ అక్కడ పడవేసి వెళ్లాడనుకొంది. పిల్లని నడుముకి కట్టుకుని కోడి కూయకముందే ఆ ఊరునుంచి వెళ్లిపోయింది. అప్పటినుంచి పిల్లని డొక్కలో పెట్టుకుని పెంచింది. సోనీ అని పేరుపెట్టుకుంది. ఇది పన్నెండేళ్ళనాటి మాట. ఈ పన్నెండేళ్లూ ఆ ముతావాళ్లు విశ్వేశ్వర్రావు వున్న ఊరు రాలేదు. ఈ ఏడే రావటం.

ఇక ఆపుకోలేకపోయాడు. కట్ట తెగిన కన్నీళ్ళు ఒక్కసారి ఉబికివచ్చినయ్. లోలోపల విధిని ఎంతో పొగడుతున్నాడు. ఉష నైనా తనకు మిగిల్చినందుకు! బిడ్డ దొరికిన ఆనందంతోపాటు బంగారంవంటి భార్యచావుకి కారణమైనందుకు సంతాపంకూడా మితిమీరిపోయింది. తన పాపానికి ఫలితంగా విధి రజని ప్రాణాన్ని దొంగిలించి శిక్షించింది.

రజనితోపాటు ఉషనుకూడా అపహరిస్తే ఎంత దుర్భరమైన శిక్ష అయ్యేది! ఏమో విధికికూడా కనికర మున్న దేమో? తన పశ్చాత్తాపాన్ని చూసి జాలిపడి ఉషని మళ్లీ తనకు దక్కించిం దేమో?

3

"ఉషా! రా తల్లీ. ఇన్నాళ్లూ, ఎందుకు బతకాలో తెలియకుండా వుండేది. ఇప్పుడు తేలిసింది. ఇన్నాళ్ళూ, ఏ మిణుకుమనే ఆశతో ఏడుస్తూ కాలంగడిపానో ఇప్పుడు తెలి సింది. ఇకముందు ఎందుకోసం నే నీ లోకంలో బతకాలో!"

వచ్చేసింది సోనీ విశ్వేశ్వర్రావుయింటికి. ఈ పన్నెం డేళ్లూ చీకటితో బావురుమంటున అతని యింట్లోకి ఉషస్సే తొంగిచూచినట్లు. రాగానే విశ్వేశ్వర్రావు సోనీకి రకరకాల చీరెలు, వింతవింత అలంకరణాలు కొని తెచ్చి యిచ్చాడు. ఇదంతా చూస్తుంటే సోనీకి ఉక్కిరిబిక్కిరయినట్లుంది. రంగు రంగుల ముతక లంబాడీగుడ్డలువిప్పి, చీరె కట్టుకోబోతున్నప్పుడు గుండె చివుక్కుమన్నది. ఇన్నాళ్ళనుంచి ఉంటున్న గూటిని అమాంతం విడిచివచ్చినట్లు మనస్సు కలవరపడుతోంది. చీరె కట్టుకుని, నగలు పెట్టుకొని, ముంగురులకి వేలాడే గవ్వలనూడ దీసి తల దువ్వుకొని, ఎదురుగా వున్న అద్దంలోకి చూసి, ఏదో ఒక కొత్తలోకంలో తెలియకుండా వచ్చిపడ్డట్టు బెదిరి పోయింది. గోనెలలాగా వున్న బట్టలు మోయటానికి అలవడిన ఆ శరీరానికి నాజూకుగావున్న ఈ ఉలిపిరిబట్టలు తొడుకున్నా

మీాద గుడ్డ వున్నట్లే అనిపించటంలేదు. దిసిమొలతో ఉన్నంత సిగ్గుగా ఉంది. తను మునుపటిమాదిరిగా లంబాడిగానే వుంటే ఎంత బాగుండేది? ఆ పొలాలలో పిట్టలాగా ఎగిరిపోతూ, గొర్రెలమందలు కాస్తూ, పాటలుపాడుతూ, చిందులు తొక్కుతూంటే ఎంత బాగుండేది? ఇన్నాళ్ళనుంచి డొక్కలో దూరి నిద్రపోయిన ముసిలిలంబాడీని వదిలేసి ముక్కూ ముఖం ఎరగని ఈ మనిషిదగ్గరికి రావటమెందుకు? ఈ మనిషి తనతండ్రి అని చెప్పినమాత్రాన నమ్మట మెట్లా?

విశ్వేశ్వరరావు పొంగిపోతున్నాడు, సోనీ ఉషగా వచ్చి ఇంట్లో వాలినందుకు. లంబాడీపిల్లలాగా పెరిగిన తన కూతురుని అమాంతంగా ఒక అతి నాగరికమైన బాలికగా చేసివేయాలని ఎంతో ఆరాటంతో అతనికి సోనీ మనసులోకి తొంగిచూసే తీరిక దొరకలేదు. ఆ లేతగుండె ఏమే ఊహలతో, ఏమే ఆలోచనలతో కలతపడుతోందో? ఇన్నాళ్లూ ఆరుబైట, పచ్చటి పొలాలనడుమ పెరిగి పెద్దదయిన ఆపిల్ల తన ఇంటి నాలుగుగోడలమధ్యా ఎంత గిజగిజ తన్నుకుంటోందో?

దినాలు గడిచిపోతున్నయ్. ఆ పల్లెటూరునుంచి దూరంగా వెళ్లిపోయి, తన కూతురిని పూర్వవృత్తాంతం తెలియని చోటికి చేర్చి, అక్కడ చక్కని పాటలూ, చదువూ, నేర్పించి మంచిసంబంధం వెదికి, ఒక ఇంటిదాన్ని చేసి, అల్లుణ్ణీ కూతుర్నీ చూసుకుంటూ ముచ్చటగా, సుఖంగా కాలం గడుపుతాను. ఇన్ని కష్టాలలోనూ, ఇంత దుఃఖంతోనూ, ఏ సుఖంకోసం బతికివున్నానో దాన్ని సంపూర్ణంగా అనుభ

విస్తాను...ఇటువంటి ఊహ లతని మనస్సులో గూడుకట్టుకో సాగినయ్. కాని ఎంత ప్రయత్నించినా ఉష తనతో చనువుగా మెలగదు. ఆమె చుట్టూ అతని మనసు పాకిపోతోంది. అయినా ఆమెమాత్రం దూరంగానే నిలబడుతుంది. ఇంకా "బాబూ! అంటుంది. ఎంత చెప్పినా "నాన్నా! అని నోరారా పిలవదు. "సోనీ" అంటే ఒక్క-సారే పలుకుతుంది. "ఉషా! అని పదిసార్లు పిలిచినా మారు పలకదు. లంబాడీ గుడిశెలో వున్నప్పుడు ఆమె ముఖాన చిందులాడిన ఆనందం ఇప్పుడు మాయమై పోయింది. ఆమె మనసులో ఏదో బాధ వున్న దన్నసంగతి, అద్దం లాగున్న ఆమె ముఖంలో కనపడుతోంది.

ఏమిటి ఆ బాధ? తన అడుగు కిందమోపితే అరిగి పోతుందేమోననుకునే తండ్రి, దివాణమంత ఇల్లు, కావలసినంత ఆస్తి, మోయలేనన్ని నగలు-ఇన్ని వున్నప్పటికీ బాధ ఎందుకో! పొలాలలో పలిటీలు కొట్టేన రామచిలుకను పంజరంలో పెట్టి పాలుపోసినా, పళ్ళు పెట్టినా, ఏం చేసినా సరే చాలా దినాల వరకూ రెక్క-లతోనూ, ముక్కు-తోనూ, గోళ్ళతోనూ పంజరం చువ్వలని తపతప కొడుతూనే వుంటుంది. సందు దొరికితే చివ్వున పారిపోదామని తహతహ పడుతుంది. పంజరంలో సుఖం లేదా? నీలిమబ్బులలోనూ, చిగిరించిన తోటలలోనూ, పొంగే వాగులలోనూ, మెలిగిన ఆ చిలకకిమాత్రమే సోనీబాధ అర్థమౌతుంది. సోనీకి ఆ చిలకబాధలో తన బాధకూడా కనబడుతుంది.

తను తప్పటడుగులువేస్తూ వచ్చీరాని మాటలతో "మా! అంటూ లంబాడీ ముదుసలిచుట్టూ తిరిగింది. అది కంటికి రెప్పలాగా కాపాడింది. చిన్నప్పటినుంచీ, తన ఈడూ జోడూ అయిన నాయకుడి పెద్దకొడుకుతో పొలాలగట్లమీద గంతులేసింది. ఒకళ్ళ నొకళ్ళు క్షణం విడిచిపెట్టకుండా వుండే వాళ్ళు. ఇద్దరూ గొఱ్ఱెలమందల నదిలిస్తూ దినమంతా కలిసి తిరిగేవాళ్ళు. పచ్చటి పొలాలమధ్య, నీలిమబ్బులనీడల్లో, ఇద్దరూ, రెక్కలకొద్దీ గిరికీలు కొట్టే పిట్టల జంటలాగా ఎగిరి పోయేవాళ్లు. నాయకుడి కొడుకు అన్నం తింటేకాని సోనీకి ముద్ద గొంతుకు దిగేదికాదు. ఎండలో, వానలో ఎడబాయ కుండా ఊరూరూ తిరిగిన వాళ్లిద్దరికీ, చిన్నతనంనుంచీ గాఢమైన స్నేహం. చిన్న నాయకుడు చేలో పెంటజిమ్ముతుంటే, సోనీ వెంటనుండి గొఱ్ఱెలని తోలేది. చిననాయకుడు మందల్ని మళ్లే సేప్పుడు, సోనీ గొఱ్ఱెల్ని బెదరగొట్టి, చెల్లాచెదరుచేసి, వాటిని వాడు ఒకచోటికి తేలేక తిప్పలపడటం చూస్తూ కిలకిలనవ్వేది. గొఱ్ఱెల బొచ్చు కత్తెరతో చెట్టునీడన సోనీ కత్తిరిస్తుంటే, నాయకుడి కొడుకు మోటాకు హారను కూత కూసేవాడు. గొఱ్ఱె సోనీచేతి కందకుండా బెదరి పారిపోవటం, సోనీ దాన్ని పట్టుకోబోవటం చూసి కేరింతలు కొడుతూ సంబరపడేవాడు. ఇట్లా వాళ్ళిద్దరి మనసులూ పెనవేసుకు పోయినయ్.

సోనీ వెళ్ళిపోయిననాడే ముసిలి లంబాడీ ముద్ద నోట పెట్టక మంచ మెక్కింది. చిన్న నాయకుడు పిచ్చివాడిలాగా

అయిపోయాడు. చేసే పనిమీద యావపోయింది. కదిలిస్తే ఎందుకో కళ్లనీళ్లు వస్తున్నయ్. రెక్కలు విరిగిపోయినట్లయింది.

సాయంకాలం ఉషని కూడా వెంటబెట్టుకొని విశ్వేశ్వర్రావు షికారుగా లంబాడీల గుడిశెలవైపు వెళ్లాడు. కొత్త వేషంలో వున్న సోనీకేసి అంతా కళ్ళప్పగించి చూస్తున్నారు. ముసిలి లంబాడీ మెల్లిగా లేచివచ్చి సోనీ నొక్కసారి గట్టిగా కౌగిలించుకుంది. అమాంతం యిద్దరూ వెక్కి వెక్కి యేడవటం మొదలు పెట్టారు. విశ్వేశ్వర్రావు గుండె కొట్టుకుంటోంది సోనీ ఏడుపు విని. "ఉషా, పద ఇంటికి పోదాం" అని పిలిచాడు. ఆ పిలుపు విని బైటపడ్డ బోనులోకే తిరిగి వెళ్ళవలసివచ్చిన జంతువులాగా బెదరిపోయింది. ఆ మెకళ్ళు ఇంతసేపూ ఎంతో ఆత్రంగా చిన్న నాయకుడికోసం వెతుక్కుంటున్నయ్. వాడొక చెట్టు చాటున నక్కి, సోనీకేసి చూస్తూ కళ్ళు తుడుచు కుంటున్నాడు. దిగాలు పడివున్న ఆ ముఖం చూడగానే ఉషకి పట్టరాని ఏడుపు వచ్చింది. అమాంతం ఆ వేషం విసిరి గిరాటేసి, ఒక్క పరుగున లంబాడీ పడుచులాగా చిన్న నాయ కుణ్ణి వెనకాలగా వెళ్లి కళ్లు మూయాలని పించింది.

ఇంతలో విశ్వేశ్వర్రావు పిలుపు వెనుక నుంచి "ఉషా, రా తల్లీ, చీకటి పడుతోంది. ఇంటికి పోదాంరా." పిలిచాడే కాని విశ్వేశ్వర్రావు మనసు పీకుతూవుంది. ఈ గుడిశెలో అందరికీ ఎంత దుఃఖం కలిగిస్తున్నాడు? ఇంతవరకూ పెంచి పెద్దదాన్ని చేసిన ఆ ముసలికి ఎంత కష్టం కలుగుతోంది?

ఈ గుడిసె విడిచి రావటానికి ఉషకే ఎంత దుఃఖం కలుగుతోంది? ఇదంతా తన ఒక్కడి సంతృప్తి కోసమేగా!

కొన్నాళ్ళు పంజరం చువ్వలని కొరికిన చిలకే చివరికి ఆ పంజరమే తన గూడు అనుకొని తృప్తి పడుతుంది. పారి పోవాలనే ప్రయత్నం మానివేస్తుంది. ఇంతవరకూ తన నిక్కడికి పట్టితెచ్చి బంధించినందుకు శత్రువుగా ఎంచిన మనిషితోనే చెలిమి చేసుకుంటుంది. అతని మాటలు తాను పలకటం మొదలు పెడుతుంది. కాని ఉషలో అప్రకారమటు వంటి మార్పు ఏమీ గోచరించటంలేదు.

గదిలో ఉష అద్దం చూసుకొని తల దువ్వుకుంటూంది. విశ్వేశ్వరరావు వెనకాలగా వచ్చి నిలబడ్డాడు. ఉష అతనిని చూడలేదు. అద్దంలో ఆమె ముఖం కనబడింది. ఆమె రెండు కళ్లూ నీళ్ళతో నిండి తొణుకుతున్నయ్. ఏదో దుఃఖం ఆమె రూపాన్ని కప్పి వేసింది. ఇది చూసేసరికి విశ్వేశ్వరరావు గుండెలో కత్తిపోటు పొడిచినట్లైంది. ఉష దుఃఖానికి కారణం నేనే కాదూ?" అన్న భావం శరవేగంతో అతనిలోంచి వెలువడింది. దోషిలాగా వెనక్కి తిరిగి బైటికి నడిచాడు.

ఆలోచనలతో విశ్వేశ్వరరావు తల్లడిల్లిపోతున్నాడు. తనబిడ్డ దుఃఖానికి కారణం తానేనని తెలుసుకుని ఏ తండ్రి గుండె సహించ గలుగుతుంది? బ్రతికింతా దుఃఖించిన తనకి ఆనందం లేకపోయినా కష్టంలేదు కాని రెక్కలువిప్పి, సీతాకోకచిలుకలాగా ఎగిరిన పాపకి దుఃఖం కలిగించటం ఎంతదారుణం? తన బిడ్డకు సుఖమివ్వటం కోసమే

కదా తాను యింత పరితపిస్తున్నది? తన ప్రయత్నమంతా చివరికి ఆమె దుఃఖానికి కారణంగా పరిణమించినప్పుడు తా నేం చెయ్యాలి? చిరునవ్వు చిందులేసిన నీ ముఖాన కన్నీళ్ళు చిందేట్లు చేసిన గుండె ఎంత రాతిగుండె? నీ సుఖమేకదూ నేను అనుక్షణమూ కోరుకుంటున్నది? నీ సుఖానికి నే నెన్నడూ అడ్డురాను. ఎవరినీ అడ్డురానీయను. తండ్రినయినందుకు నీ సుఖమే తల్లీ నాకీ లోకంలో కావలసింది.

ఎంతసేపయిందో యిల్లా ఊహల్లో గిరగిర తిరుగుతూ. లేచి ఉషగదిలోకి వెళ్లాడు. గదిలో ఒకమూల లంబాడీలంగా, గౌనూ, దంతపుగాజులూ, పావలా దండలూ పోగుపెట్టి ఉన్నయ్. వాటిని ఆప్యాయంగా చేతులతో నిమురుతూ, వాటి వైపే పదేపదే చూస్తూ ఉష వెక్కి-వెక్కి- ఏడుస్తోంది. జడివాన లాగా కన్నీరు రాలుస్తోంది. విశ్వేశ్వర్రావు గబగబా పరు గెత్తుకోవెళ్ళి, చేతులతో కూతుర్ని లేవదీసి, కౌగిలించుకొని, తన ఉత్తరీయంతో కన్నీళ్ళు తుడిచాడు. దుఃఖంలోకూడా ఒక వింత అందంతో మెరుస్తున్న ఉష ముఖాన్ని చేతులతో నిమిరి, ముఖం మీదపడి తడిసిన ముంగురులను వేళ్ళతో పైకి సరిదిద్ది, "ఏడుస్తున్నావా తల్లీ" అని ఒక్క-ముద్దు పెట్టు కున్నాడు. ఆ ముద్దులో పరితాపంతో మండిపోయే తండ్రి గుండె దాగిఉన్నదని ఉషకు తెలిసిందో లేదో! తన తండ్రి ప్రేమ పంజరమై పోనీని బంధించదు. ఆమెకి రెక్క-లిచ్చి రివ్వున ఎగిరి పోనిస్తుంది.

ఉపసంహారము

పంజరం ముక్కలు ముక్కలై పోయింది. గిజగిజ తన్ను కున్న చిలక తుఱ్ఱున ఎగిరి పోయింది. కేరింతలు కొడుతూ జంటతో కలిసి, కిలకిల కూస్తూ ఎగిరిపోయింది.

ఉష మళ్ళీ సోనీ అయిపోయింది. సోనీకీ, చిన్ననాయకుడికీ పెళ్ళి జరిగింది. పెళ్ళినాడు ముసలి లంబాడీది సంతోషాన్ని పట్టలేక వాళ్ళిద్దరినీ దీవిస్తూ ఆవలించి స్వర్గానికి వెళ్ళిపోయింది.

విశ్వేశ్వరరావు తన ఆస్తినంతా కూతురికి విల్లు వ్రాసియిచ్చాడు. అతనికి కూడా ఈ కృత్రిమ నాగరికతతో నిండిన ప్రపంచమంతా ఒక పెద్ద పంజరంగా గోచరించినది. "అమ్మా, నన్ను కూడా నీతో రానీవూ? నే నింకా ఈ పంజరంలో పడి ఉండలేను." అంటూ విశ్వేశ్వరరావు లంబాడీలలో కలిసిపోయాడు. ఏ పచ్చటి పొలంగట్టున, చల్లటి చెట్లనీడలలో కూతురు కేసి చూస్తూ హాయిగా ప్రాణం విడుస్తాడో! తన కూతురి సుఖాన్ని కళ్ళారా చూసి ఎంత ఉప్పొంగిపోతాడో! కూతురు తనకోసం రాల్చిన కన్నీటి చుక్కలన్నీ భద్రంగా దాచుకొని, ఆ లోకంలో రజని నెప్పుడైనా కలుసుకొంటే "చూశావా రజనీ, మన పాప, నన్ను క్షమించి నాకీ కన్నీరు కానుకగా నిచ్చింది. ఇవిగో మన పాప కళ్ళల్లోంచి రాలిన ముత్యాలు! చూడు, మరి నువ్వు నన్నెప్పటికైనా క్షమిస్తావా? క్షమించగలవా? చెప్పవూ? అని దీనంగా వేడుకుంటాడు!